

ఘనంగా భీమదేవర పండుగ

జిల్లాలోని తాండూర్, భీమిని, నెన్నెల, హాజీపూర్ మండలాల్లో సోమవారం ఆదివాసీలు భీమదేవర పండుగ ఘనంగా నిర్వహించారు. జెండాలు ఎగురవేసి ప్రత్యేక పూజలు చేశారు. 9లో



కాలనీలను కమ్మేస్తున్న పొగ

నస్పూర్ పట్టణ పరిధిలోని డంప్‌యార్డు నుంచి వెలువడుతున్న పొగ కాలనీలను కమ్మేస్తోంది. శ్వాస తీసుకోవడంలో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. 8లో

గరిష్టం/కనిష్టం
31.0 /18.0

వాతావరణం

ఉదయం వేళ ఆకాశం పాక్షికంగా, రాత్రివేళ పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఈశాన్యం దిశగా చలిగాలులు వీస్తాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో వీటీజీ సెట్ 2024 వాల్‌పోస్టర్లను అదనపు కలెక్టర్ మోతిలాల్, మంచిర్యాల ఆర్డీవో రాములు, జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్యతో కలిసి ఆవిష్కరించారు.

గురుకృప మహా సమ్మేళన మహోత్సవం

పాతమంచిర్యాల: నార్నూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో ఈ నెల 11న నిర్వహించనున్న ప్రేమ్‌సింగ్ మహరాజ్ గురుకృప మహా సమ్మేళన ఉత్సవం పోస్టర్లను కలెక్టర్ సంతోష్ ఆవిష్కరించారు. ట్రైబల్ జర్నలిస్టు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్యా రవినాయక్, జిల్లా బంజారా జేఏసీ అధ్యక్షుడు సపాట్ శంకర్, నాయకులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల నిరాహార దీక్ష



దీక్షలో యూనియన్ నాయకులు, కార్మికులు

బెల్లంపల్లి: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సోమవారం దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ఎదుట రైల్వే కార్మికులు ఒక రోజు సామూహిక నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా యూనియన్ బెల్లంపల్లి బ్రాంచి అధ్యక్షుడు ఎస్.నాగరాజు, కార్యదర్శి సాంబశివుడు మాట్లాడుతూ రైల్వే కార్మికులపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై మండిపడ్డారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. దశలవారీగా ప్రైవేటీకరణ యత్నాలు జరుగుతున్నాయని, ప్రైవేటీకరించే యోచన విరమించుకోవాలని అన్నారు. ఈ నెల 11న రైల్వే డివిజన్ కేంద్రం సికింద్రాబాద్‌లో నిర్వహించే మహాధర్నాను రైల్వే కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. ఈ దీక్షలో మజ్దూర్ సంఘం నాయకులు డీపీ సాల్మన్, బి.రమేష్, సురేష్, కేశవ్, సోకేష్,మీనా, నీరజ్, సందీప్, రమేష్, చిరంజీవి, రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి జానపద నృత్య పోటీలకు ఎంపిక

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల మంచిర్యాల విద్యార్థులు జాతీయ స్థాయి జానపద నృత్య పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 5న శిల్పారామంలో నిర్వహించిన యువజనోత్సవ పోటీల్లో మోడల్‌స్కూల్‌కు చెందిన పది మంది విద్యార్థుల బృందం అత్యుత్తమ ప్రదర్శనతో ప్రథమస్థానంలో నిలిచింది. వీరు ఈ నెల 12 నుంచి 17వరకు నాసిక్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో ప్రదర్శన ఇవ్వనున్నారని డీవైఎస్‌ఓ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ రజనీ, గైడ్ టీచర్ వనితగ్రేస్, మల్లేశ్వరి అభినందించారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు..

జన్నారం: మండల కేంద్రంలోని స్లేట్ ఎక్సలెంట్ పాఠశాల 8వ తరగతి విద్యార్థి బొమ్మిడి రిషివర్మ రాష్ట్రస్థాయి అంతర్ పాఠశాల సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఇటీవల ఆసిఫాబాద్‌లో జరిగిన జోనల్ టోర్నమెంట్ కమ్ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చాడని పేర్కొన్నారు. ఈ నెల 16 నుంచి 18 వరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. విద్యార్థిని ప్రిన్సిపాల్ శ్రీకాంత్‌రెడ్డి, ఇంచార్జి రజిత, యేసు అభినందించారు.

రిటైర్డ్ కార్మికులకు వాటా చెల్లించాలి



మంచిర్యాలటౌన్: సింగరేణి రిటైర్డ్ కార్మికులకు రావాల్సిన లాభాల వాటా చెల్లింపుల తేదీని సింగరేణి యాజమాన్యం వెంటనే ప్రకటించాలని, లేనిపక్షంలో సింగరేణి వ్యాప్తంగా జీఎం కార్యాలయం వద్ద ఆందోళనలు చేపడుతామని విశ్రాంత కార్మిక సంఘం నాయకులు తెలిపారు. జిల్లా కేంద్రంలో సోమవారం సమావేశమైన రిటైర్డ్ కార్మికులు మాట్లాడుతూ 2022, 2023లో రిటైర్డ్ కార్మికులకు లాభాల వాటా, దీపావళి బోనస్, 11వ వేజ్‌బోర్డు వేతన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి పూదరి నర్సయ్య, లక్ష్మీనారాయణగౌడ్, రాజన్నగౌడ్, విగ్నేశ్, శంకరయ్య, సాయన్న పాల్గొన్నారు.

లక్ష్యం 100%



హాజీపూర్‌లో పన్నులు వసూలు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్

- పంచాయతీల్లో పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి
- నేటి వరకు 67శాతమే..
- ప్రత్యేక డ్రైవ్‌కు సన్నాహాలు
- ప్రస్తుతం రాష్ట్రంలో పదో స్థానంలోపు జిల్లా

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలో ఇంటి పన్ను వసూళ్ల లక్ష్యాన్ని సాధించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఎంపీవోలతోపాటు కార్యదర్శులను పన్నుల వసూలుకు సమాయత్తం చేయడంతోపాటు ప్రత్యేక డ్రైవ్, తదితర కార్యక్రమాల నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 67శాతం వరకు పన్నులు వసూలు చేయగా.. మిగతా 33శాతం మరో 80రోజుల్లో పూర్తి చేసి వంద శాతం లక్ష్యాన్ని సాధిస్తామని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. పన్నుల చెల్లింపులకు కొందరు స్వచ్ఛందంగా ముందుకు వస్తుండగా మరికొందరు ఇంటికి వెళ్లి మరీ అడిగితే గానీ చెల్లించడం లేదు. పన్నుల వసూళ్లలో జిల్లా ప్రస్తుతం రాష్ట్రంలో పదో స్థానంలోపు ఉండగా మొదటి స్థానం చేరుకునేందుకు అధికార యంత్రాంగం విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. ఇంటి పన్నులు, వాణిజ్య పన్నులు, మంచినీటి కుళాయి బిల్లుల వసూళ్లు వంద శాతం సాధించాలని ఓ వైపు ఉన్నతాధికారులు ఒత్తిడి పెంచుతుండడంతో గ్రామాల్లో పన్నుల వసూళ్ల కోసం నిరంతరాయంగా స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలు, ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ తదితర ప్రభుత్వ కార్యక్రమాలతో పంచాయతీ సిబ్బంది బిజీగా ఉన్నా పన్నుల లక్ష్యం మాత్రం సాధిస్తామని అంటున్నారు. జిల్లాలో 310 గ్రామ పంచాయతీల ద్వారా ఇంటి పన్నులు, ఇతర పన్నుల ద్వారా రూ.8 కోట్ల 10 లక్షల 61 వేలు వసూలు చేయాలనే లక్ష్యం పెట్టుకున్నారు. ఈ లక్ష్యంలో భాగంగా ఇప్పటివరకు జిల్లాలో రూ.5 కోట్ల 42 లక్షల 65 వేలు పన్నులు వసూలయ్యాయి. మిగతా రూ.2 కోట్ల 67 లక్షల 99 వేలు పన్నులను మార్చి 31లోగా పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఇంకా 33 శాతం..

వంద శాతం పన్నులు వసూలు చేసి జిల్లాను అగ్రభాగాన నిలపాలని ఉన్నతాధికారుల ఇచ్చిన సూచనల మేరకు పంచాయతీ కార్యదర్శులు, మండల పంచాయతీ అధికారులు(ఎంపీఓ), ఎంపీడీఓలతో ప్రత్యేకంగా సమావేశమై పన్నుల వసూళ్లలో వేగం పెంచాలని ఇప్పటికే స్పష్టం చేశారు. జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో ఇప్పటి వరకు 67 శాతం వరకు పన్నులు వసూళ్లు కాగా గడువు నాటికి 100 శాతం పూర్తి చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు. ఇందుకోసం అంతా సమష్టిగా పని చేయాలని మండల, జిల్లా స్థాయి అధికారులు కార్యదర్శులకు పదే పదే సూచిస్తున్నారు. దీంతో మండల పంచాయతీ అధికారుల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు పన్నుల వసూళ్లు వేగవంతం చేస్తున్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పన్నుల వసూళ్లలో మరింత దృష్టి సారిస్తే తప్ప లక్ష్యం చేరేలా లేదు.

చేరుకునేలా చూస్తున్నాం..



జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో పన్నులు వంద శాతం వసూళ్లను చేరుకునేలా చూస్తున్నాం. ఇప్పటికే 67 శాతానికి పైగా పన్నులు వసూళ్లు కాగా మిగతా లక్ష్యాన్ని గడువులోగా వసూలు చేస్తాం. పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి తక్కువ శాతం వసూళ్లు చేసిన గ్రామాలను గుర్తించి వసూళ్ల వేగాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటాం. స్పెషల్ డ్రైవ్ చేపట్టడంతోపాటు పన్ను బకాయిలు ఉన్న వారు సకాలంలో చెల్లించి గ్రామాభివృద్ధికి పాటుపడేలా చర్యలు తీసుకుంటున్నాం. పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓలతో పన్నుల వసూళ్లపై నిరంత రం పర్యవేక్షిస్తూ అప్రమత్తం చేస్తున్నాం. పన్నులు చెల్లిస్తేనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమవుతుంది.

– వెంకటేశ్వర్‌రావు, డీపీఓ, మంచిర్యాల

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ బి. సంతోష్

- జిల్లా కలెక్టర్ బి.సంతోష్
- బారులు తీరిన అర్జీదారులు
- భూ సమస్యలపైనే అధిక ఫిర్యాదులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను అధికారులు సమన్వయంతో సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, మంచిర్యాల ఆర్డీవో రాములుతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని, పది రోజుల్లోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో జిల్లాకు చెందిన సమస్యలపై దరఖాస్తులు వస్తే పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

- మంచిర్యాలకు చెందిన బత్తిని శ్రీలత, మందమర్రి శకుంతల తమకు గత ప్రభుత్వ హయాంలో లాటరీ ద్వారా డబుల్ బెడ్రూం ఇల్లు కేటాయించారని, ఇప్పించాలని అర్జీ సమర్పించారు.
- నెన్నెల మండలం చిత్తాపూర్ గ్రామంలోని ఆస్పత్రి భూమి కబ్జా చేశారని, విచారణ జరిపి పేదలకు కేటాయించాలని గ్రామస్తులు కోరారు.
- బెల్లంపల్లి మండలం పెర్కపల్లి గ్రామానికి చెందిన లక్ష్మి బానోత్, నెన్నెల మండల కేంద్రానికి చెందిన తోట మల్లేష్, మందమర్రి పట్టణానికి చెందిన పి.చిరంజీవచారి, భీమిని మండలం బిట్టూర్‌పల్లికి చెందిన యాటకారి నారాయణ, లక్సెట్టిపేట మండలం వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన జి.రాయమల్లు భూ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.
- మంచిర్యాలలోని తిలక్‌నగర్‌కు చెందిన కొత్తపల్లి శ్వేత తన భర్త డిఫెన్స్‌లో పని చేస్తూ విధి నిర్వహణలో చనిపోయాడని, ఇంది రమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరింది.

విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలి



మంచిర్యాల పట్టణ పరిధిలోని రాజీవ్‌నగర్ కాలనీలో నివాసాలు ఏర్పాటు చేసుకున్నాం. టౌన్-1 పరిధిలో విద్యుత్ లైన్, రోడ్లు, తాగునీరు లైన్ ఏర్పాటు చేయాలి. గత డిసెంబర్‌లో కూడా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశాం. ఇప్పటికైనా విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలి.

– రాజీవ్‌నగర్ కాలనీవాసులు

న్యాయం చేయాలి



నా భర్త గత ఏడాది క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. నా భర్త కుటుంబ సభ్యులు ఆస్తి కోసం నన్ను చిత్రహింసలకు గురిచేస్తూ ఇంటి నుంచి వెళ్లగొట్టారు. రైతుబీ మా రూ.5 లక్షలు, ఎల్ఐసీ బాండ్లు, బంగా రం తీసుకున్నారు. నా పిల్లకు న్యాయం చే యాలి. నా భర్త కుటుంబం నన్ను కాపాడాలి.

– వైష్ణవి అచ్చులాపూర్, తాండూర్

- లక్సెట్టిపేట మండలం గుల్లకోట గ్రామస్తులు ఎల్లంపల్లి ప్రాజెక్టులో ముంపునకు గురైన వారికి ఇళ్ల నష్ట పరిహారం ఇప్పించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

అందని రేషన్ బియ్యం

- దుకాణాలకు చేరని వైనం
- సంక్రాంతి పండుగకు పస్తులేనా..?

మంచిర్యాలటౌన్: పేదలకు ప్రతినెలా పంపిణీ చేసే రేషన్ బియ్యం ఈ నెల ఆలస్యమవుతోంది. దీంతో సంక్రాంతి పండుగకు పస్తులు ఉండాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. పౌరసరఫరాల శాఖ ద్వారా బియ్యం సరఫరా చేస్తుండగా.. ఈ నెల 8వ తేదీ వచ్చినా రేషన్ దుకాణాలకు సరఫరా కాలేదు. సక్రాంతి పండుగలోగా పేదలకు పంపిణీ అయ్యే పరిస్థితి లేకపోవడంతో పస్తులు తప్పేలా లేదు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ బియ్యం జిల్లాలోని అన్ని దుకాణాలకు చేరకపోవడంతో లబ్ధిదారులు దుకాణాల వద్దకు వచ్చి వెళ్తున్నారు. సంక్రాంతికి పిండి వంటలు, సకినాలు చేసుకునే వారికి ఇబ్బందిగా మారుతోంది. జిల్లా వ్యాప్తంగా 423 రేషన్‌దుకాణాలు ఉండగా 2,19,195 కార్డుదారులు, 639,668 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి జనవరి నెలకు 3,500 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేయాల్సి ఉంది. బియ్యం సరఫరా ప్రారంభించినా కనీసం వారం రోజులకు పైగా పడుతుంది. ఇప్పుడిప్పుడే అధికారులు బియ్యం పంపిణీకి సమాయత్తం అవుతుండగా.. అన్ని దుకాణాలకు చేరాలంటే పండుగ ముగుస్తుంది. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి బియ్యం సరఫరాకు సరిపడా లారీలు ఏర్పాటు చేయకపోవడం వల్లే రోజుల తరబడి సమయం వృథా అవుతోందని రేషన్ డీలర్లు చెబుతున్నారు. ఎక్కువ లారీలు కేటాయిస్తే రెండు మూడు రోజుల్లోనే లబ్ధిదారులకు బియ్యం అందే అవకాశం ఉంటుంది.



రేషన్ దుకాణంలో అందిస్తున్న బియ్యం(ఫైల్)


పంపిణీ ప్రారంభించాం



ఈ నెలలో రేషన్ బియ్యం షాపులకు సరఫరా చేయడం కొంత ఆలస్యమైంది. ఇప్పటికే పంపిణీని ప్రారంభించి దాదాపుగా వంద షాపులకు పైగా పంపిణీ చేశాం. మిగతా షాపులకు వీలైనంత త్వరగా పంపిణీ చేసి పండుగ వరకు రేషన్ బియ్యం దుకాణాలకు చేరేలా చర్యలు తీసుకుంటాం.

– గోపాల్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్

తప్పులు లేకుండా నమోదు చేయాలి



మున్సిపల్ కార్యాలయంలో మోతిలాల్ పరిశీలన

మంచిర్యాలటౌన్: ప్రజాపాలన దరఖాస్తుల్లోని వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. సోమవారం మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తులను వివరాలను ఈ నెల 17లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. తహసీల్దార్లు, మున్సిపల్ వార్డు అధికారులు, ఎంపీడీవోలు డేటా ఎంట్రీలను పరిశీలించాలని సూచించారు. ఇబ్బందులు తలెత్తినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

నెన్నెలలో పరిశీలన..

నెన్నెల: మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఆర్‌సీ కార్యాలయాల్లో ప్రజాపాలన దరఖాస్తుల వివరాల ఆన్‌లైన్ నమోదును అదనపు కలెక్టర్ రాహుల్ సోమవారం పరిశీలించారు. మండల వ్యాప్తంగా 7,688 దరఖాస్తులు వచ్చాయని, తప్పులు లేకుండా నమోదు చేయాలని తెలిపారు. ఎంపీడీఓ వరలక్ష్మి, డెప్యూటీ తహసీల్దార్ ప్రకాష్, ఆర్ఐ గణేష్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై సీఎం ఫోకస్



సీఎం రేవంత్‌రెడ్డితో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు

- ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జీలతో సమీక్ష
- ఈ నెల 26 తర్వాత ఇంద్రవెల్లి పర్యటన

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి సమీక్షా సమావేశాలను ఆదిలాబాద్ జిల్లా నుంచే శ్రీకారం చుట్టారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు వినోద్, వివేక్, ప్రేమ్‌సాగర్‌రావు, వెడ్మ బొజ్జు, ఆదిలాబాద్, బోథ్, నిర్మల్ నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌చార్జీలు కంది శ్రీనివాసరెడ్డి, ఆడే గజేందర్, కూచాడి శ్రీహరిరావుతో సీఎం సోమవారం సమావేశమయ్యారు. ఆయా నియోజకవర్గాల్లో సమస్యలపై ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జీలను అడిగి తెలుసుకున్నారు. వారు కూడా తమ ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల అభివృద్ధితో పాటు ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల సంక్షేమ ఫలాలు అర్హులైన వారికి అందించడమే లక్ష్యంగా ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి వారికి దిశానిర్దేశం చేసినట్లుగా తెలిసింది. సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తానని భరోసా ఇచ్చినట్లు సమాచారం. కాగా సీఎం జిల్లాల పర్యటన ఈ నెల 26 నుంచి చేపట్టనున్నారని, ఇందులో భాగంగా తొలి పర్యటన ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి నుంచే ప్రారంభం కానుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తెలిపారు. ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద చేపట్టనున్న అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నట్లుగా ఆయన వివరించారు.

మాతాశిశు ఆస్పత్రి తరలించాలని వినతి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గోదావరి రోడ్డులో నిర్మించిన మాతాశిశు ఆరోగ్య కేంద్రం ప్రతియేటా వర్షాకాలంలో వరదలో మునిగిపోతోందని, ఇతర ప్రాంతానికి తరలించేలా చూడాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. సోమవారం హైదరాబాద్‌లో సీఎంను కలిసి విన్నవించారు. జిల్లాకు సంబంధించిన అభివృద్ధి పనులు, పెండింగ్ ప్రాజెక్టులు, రహదారులు, గిరిజనులకు పోడు భూములు వంటి అంశాలను వివరించారు. అభివృద్ధి పనులపై వినతిపత్రం అందజేశారు.

సీఎంఆర్ త్వరగా పూర్తి చేయాలి

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మంచిర్యాలఅగ్రికల్చర్: వరిధాన్యం సీఎంఆర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ మిల్లుల సామర్థ్యానికి అనుగుణంగా మిల్లింగ్ సకాలంలో పంపించాలని, సీఎంఆర్ ప్రక్రియలో రీసైక్లింగ్ బియ్యం రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజాపాలన దరఖాస్తులు ఈ నెల 17లోగా ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని, పొరపాట్లకు తావు లేకుండా దరఖాస్తులో పొందుపరిచిన సమాచారాన్ని నమోదు చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ బి.సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో సీఎంఆర్ నిర్దేశిత లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు మిల్లర్ల సమన్వయంతో కృషి చేస్తున్నామని తెలిపారు. లక్ష్యాలను ఈ నెల 31లోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజాపాలన దరఖాస్తుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని పేర్కొన్నారు.



పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి.సంతోష్

శిబిరానికి కాంగ్రెస్ కౌన్సిలర్లు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో కౌన్సిలర్ల క్యాంపు రాజకీయాలు పోటాపోటీ సాగుతున్నాయి. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసాన్ని ప్రతిపాదించిన కౌన్సిలర్లు క్యాంపు రాజకీయాలకు తెర తీసిన విషయం తెలిసిందే. ఈ నెల 4న బీఆర్ఎస్ పార్టీ తమ కౌన్సిలర్లను శిబిరానికి తరలించగా.. తాజాగా సోమవారం కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రైవేట్ బస్సులో శిబిరానికి వెళ్లారు.

కాంగ్రెస్ కౌన్సిలర్లు వీరే..

కాంగ్రెస్ పార్టీ తరపున 10మంది కౌన్సిలర్లు వెళ్లగా.. వీరిలో అవిశ్వాసాన్ని ఎదుర్కోబోతున్న చైర్‌పర్సన్ జక్కుల శ్వేత ఉండడం గమనార్హం. ఆమెతోపాటు కౌన్సిలర్లు పత్తిపాక రేణుక, దాసరి విజయ తిరుమల, మాటూరి మధు, బుక్యరాములు నాయక్, బండి ప్రభాకర్, కొమ్ముల సురేష్, గుజ్జ రవి, కేంశెట్టి సరిత, నీలి కృష్ణ ఉన్నారు. మరో కౌన్సిలర్ సూరం సంగీత, బీజేపీ కౌన్సిలర్ అనిత యాదవ్ మంగళవారం వరకు శిబిరంలో చేరుతారని చెబుతున్నారు. దీంతో కాంగ్రెస్ సభ్యుల సంఖ్య 12కు చేరనుంది. బీఆర్ఎస్ శిబిరంలో 18 మంది ఉండగా మరో ఇద్దరు జత కలువనున్నట్లు తెలుస్తోంది. దీంతో వారి సంఖ్య 20కి చేరనుంది. మరో సభ్యుడు వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ తటస్థ వైఖరి అవలంబిస్తున్నారు.

చైర్‌పర్సన్‌గా శ్వేత ఓకే..!


అవిశ్వాసాన్ని ప్రకటించిన కాంగ్రెస్ కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌గా జక్కుల శ్వేత కొనసాగేందుకు అంగీకారం తెలిపినట్లుగా తెలుస్తోంది. ఇటీవల ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను కలిసి కౌన్సిలర్లు చర్చించినట్లుగా తెలుస్తోంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి చైర్‌పర్సన్‌గా గెలిచిన శ్వేతపై కౌన్సిలర్లు అవిశ్వాసాన్ని ప్రకటించిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆచితూచీగా వ్యవహరించాలని ఎమ్మెల్యే సూచించినట్లుగా తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీలో చేరిన చైర్‌పర్సన్ శ్వేతను పదవి నుంచి దింపేస్తే ప్రజల్లో సంకేతాలు వేరేగా వెళ్తాయని, ఆమెనే మళ్లీ చైర్‌పర్సన్‌గా కొనసాగనీయాలని కాంగ్రెస్ కౌన్సిలర్లను సముదాయించి రాజీమార్గాన్ని నిర్దేశించినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఆ కారణంగానే కాంగ్రెస్ సభ్యులతో కలిసి చైర్‌పర్సన్ శిబిరానికి వెళ్లినట్లుగా తెలుస్తోంది. అవిశ్వాసం నెగ్గకుండా వ్యవహరించి ఆ తర్వాత సుదర్శన్‌ను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే అవకాశాలు ఉన్నట్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. అది సాధ్యం కాకపోతే కాంగ్రెస్ పార్టీకి చెందిన బండి ప్రభాకర్‌ను వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారనే ప్రచారం జరుగుతోంది.



శిబిరానికి వెళ్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

ఎన్నికలు నిర్వహించాలని నిరసన

మంచిర్యాలఅగ్రికల్చర్: దేవపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో ఎన్నికలు నిర్వహించాలని లోకల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్మికులు సోమవారం సమీకృత కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ రెండేళ్లకు ఒకసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా ఐదేళ్లుగా నిర్వహించడం లేదని తెలిపారు. రెండుసార్లు కార్మిక శాఖ కార్యాలయానికి వచ్చామని, మరోసారి రావాలని అంటున్నారని వాపోయారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా ఎన్నికలు నిర్వహించాలని పేర్కొన్నారు.



ఓరియంట్ సిమెంట్ కంపెనీ కార్మికులు

పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గంలో చోటు

లక్సెట్టిపేట/దండేపల్లి: పీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గంలో జిల్లాకు చెందిన ముగ్గురికి చోటు దక్కింది. లక్సెట్టిపేట మండలం గుల్లకోట పాఠశాలకు చెందిన రవికాంత్, లక్ష్మీపూర్ పాఠశాలకు చెందిన కొత్త సురేష్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా, దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన సంగర్స్ రాజేశ్వర్‌రావు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, గంగాధర్, లక్సెట్టిపేట మండల అధ్యక్షుడు బైరి సోమన్న వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.



అధ్యక్షుడు సురేష్



ఉపాధ్యక్షుడు రాజేశ్వర్

క్లుప్తంగా

గంజాయి కేసులో ముగ్గురి బైండోవర్



బైండోవర్ అయిన నిందితులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గంజాయి అక్రమ రవాణా కేసులో ముగ్గురు నిందితులను సోమవారం హాజీపూర్ పోలీసులు బైండోవర్ చేశారు. హాజీపూర్ మండలం కర్ణమామిడికి చెందిన చిట్యాల సుధాకర్, మంద హృతిక్, పెద్దంపేటకు చెందిన దుర్గం రాజ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకుని బైండోవర్ చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

కుక్కకాటుకు బాలునికి గాయాలు

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని రాజంపేటలో శౌలోభ్ (08) అనే బాలుడిని సోమవారం వీధి కుక్క కరవడంతో కుడి కాలుకు గాయమైంది. వెంటనే తల్లిదండ్రులు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. పట్టణంలో వీధి కుక్కల బెడద ఎక్కువైందని, ముఖ్యంగా రాత్రి సమయాల్లో భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వీధి కుక్కలను అరికట్టాలని కోరుతున్నారు.

కారు ఢీకొని యువకుడు మృతి





ప్రమాద స్థలంలో మృతదేహం ప్రసాద్ (ఫైల్)

దండేపల్లి: మండలంలోని కన్నెపల్లి వైకుంఠ ధామం సమీపంలో సోమవారం కారు ఢీకొని యువకుడు మృతి చెందినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. వేమనపల్లి మండలం జిల్లెడ గ్రామానికి చెందిన చిప్ప ప్రసాద్ (26) ఓ ప్రైవేటు డ్రిప్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా బైక్‌పై దండేపల్లికి వచ్చి వెళ్తుండగా లక్సెట్టిపేట వైపు నుంచి ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య



రాజమల్లు మృతదేహం

చెన్నూర్: చెన్నూర్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్సై వెంకటేశ్వర్‌రావు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడు కోటపల్లి మండలం రొయ్యలపల్లికి చెందిన దుర్గం రాజమల్లు (40)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మృతునికి రెండెకరాల భూమి ఉందని, పంటల కోసం చేసిన అప్పులు ఉన్నాయని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కాలనీలను కమ్మేస్తున్న పొగ

- శ్వాస తీసుకోవడంలో చిన్నారులు, వృద్ధుల ఇబ్బందులు
- ముందస్తు ప్రణాళికలు లేకుండా డంప్‌యార్డ్ ఏర్పాటు
- పొగతో నరకయాతన అనుభవిస్తున్న పలు కాలనీల ప్రజలు
- కార్మికుల ఆరోగ్యంపై దుష్ప్రభావం



డంప్‌యార్డును పరిశీలిస్తున్న కమిషనర్, కౌన్సిలర్లు



డంప్‌యార్డు నుంచి వెలువడుతున్న పొగ

నస్పూర్: పట్టణ పరిధిలోని పలు కాలనీల్లో ఆదివారం రాత్రి దుర్వాసనతో కూడిన దట్టమైన పొగ కమ్మేసింది. కాలనీ వాసులకు ఏం జరుగుతుందో అర్థం కాలేదు. ఎక్కడైనా అగ్నిప్రమాదం జరిగిందేమోనని ఆరా తీయడం మొదలు పెట్టారు. డంప్‌యార్డులో చెత్తను తగులబెట్టారని తెలియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న అధికారులు ఫైరింజన్, నాలుగు వాటర్ ట్యాంకర్లతో మంటలు ఆర్పివేయించారు. సోమవారం ఉదయం కమిషనర్ రమేశ్ కౌన్సిలర్లు తోట శ్రీనివాస్, సురిమిల్ల వేణు డంప్‌యార్డును పరిశీలించారు.

తరచూ పునరావృతం...

డంప్‌యార్డులోని చెత్తకు నిప్పు పెడుతుండడంతో దానినుంచి వెలువడే పొగ రోజుల తరబడి కాలనీలను కమ్మేయడం లాంటి ఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. అయినా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి. ప్రతీరోజు చీకటి అయ్యిందంటే అంటే చాలు.. సీసీసీ ఆర్‌కే 5 కాలనీ సమీపంలోని డంప్‌యార్డు నుండి వెలువడే దుర్వాసనతో కూడిన పొగ పట్టణ పరిధిలోని పలు కాలనీలు కమ్మేస్తుంది. దీంతో కాలనీవాసులు రాత్రి 7 అయ్యిందంటేనే తలుపులు వేసుకుని ఇంట్లో గడపాల్సిన పరిస్థితి. ఒకవైపు చలికాలంలో పడిపోయిన ఉష్ణోగ్రతలు, మరోవైపు కాలుష్యంతో నిండిన పొగ పీల్చుకోవడం వల్ల వృద్ధులు, చిన్నారులు శ్వాస తీసుకోవడంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సింగరేణి స్థలంలో ఏర్పాటు ...

సీసీసీ ఆర్‌కే 5 కాలనీ సమీపంలో సింగరేణి సంస్థకు చెందిన సుమారు పదెకరాల స్థలంలో అధికారుల అనుమతితో మున్సిపల్ అధికారులు డంప్‌యార్డు ఏర్పాటు చేశారు. కానీ అట్టి స్థలాన్ని సింగరేణి అధికారులు రాతపూర్వకంగా మున్సిపాలిటీకి కేటాయించలేదు. దీంతో మున్సిపల్ అధికారులు ఆ స్థలంలో ప్రతీరోజూ సేకరించిన చెత్తను డంపింగ్ చేస్తున్నా ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టడం లేదు. ఆకతాయిలు తరచూ చెత్తను తగలబెడుతుండడంతో అందులో నుంచి వచ్చే దుర్వాసన, పొగతో ఆర్‌కే 5, సీసీసీ టౌన్‌షిప్, నాగార్జున, న్యూనాగార్జున, షిర్కే, తాళ్లపల్లి ఆర్ ఆర్అండ్ కాలనీ, సింగాపూర్ ఆర్అండ్ఆర్‌కాలనీ, సుందరయ్య కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. డంపింగ్ యార్డుకు సమీపంలో ముక్కిడి పోచమ్మ గుడి, చర్చిలకు వచ్చే భక్తులు, ఆర్‌కే 5 కాలనీలో వృద్ధాశ్రమంలోని వృద్ధులు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తడి, పొడి చెత్తను వేరుచేయాల్సి ఉండగా...

మున్సిపల్ సిబ్బంది సేకరించిన చెత్తలో నుంచి తడి, పొడి చెత్తను వేరుచేసి సేంద్రియ ఎరువుగా మార్చి ఇతర అవసరాలకు వినియోగించాలి. కానీ మున్సిపల్ అధికారులు ఆ దిశగా ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. దీంతో డంప్‌యార్డులో చెత్త పేరుకుపోతోంది.

ప్రతీరోజు 22 మెట్రిక్ టన్నుల చెత్త

పట్టణ పరిధిలో ప్రతీరోజు 22 మెట్రిక్ టన్నుల చెత్త వెలువడుతోంది. ఇందులో 7.7 మెట్రిక్ టన్నుల తడిచెత్త, 13.64 మెట్రిక్ టన్నుల పొడిచెత్త, 0.66 మెట్రిక్ టన్నుల హానికరమైన చెత్త వెలువడుతుంది. చెత్త సేకరణకు 34 ట్రాలీలు, రెండు ట్రాక్టర్లు వినియోగిస్తున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి

ప్రస్తుతం పట్టణ జనాభా సుమారు 85 వేలకు పైచిలుకు ఉంటుంది. రాబోయే రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉంది. దీంతో చెత్త సైతం పెరుగుతుంది. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని అన్ని ఆధునిక సౌకర్యాలతో కూడిన డంప్‌యార్డు ఏర్పాటు చేయాలి. చెత్త పేరుకుపోకుండా చేసి సమస్యకు పరిష్కారం చూపేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి చర్యలు

డంప్‌యార్డులో వేసిన చెత్తకు ఆకతాయిలు నిప్పు పెడుతుండడంతో సమస్య ఉత్పన్నం అవుతోంది. అధికారులతో చర్చించి బయోమైనింగ్ పద్ధతిలో ప్రస్తుతం ఉన్న చెత్తను తొలగించేలా చేస్తాం. డంప్‌యార్డు నుంచి దుర్వాసన, పొగరాకుండా తగిన చర్యలు తీసుకుంటాం. సమస్య శాశ్వత పరిష్కారానికి సైతం చర్యలు తీసుకుంటాం.

– టి.రమేశ్, మున్సిపల్ కమిషనర్, నస్పూర్

ఫిషరీస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడిగా కృష్ణ



నియామకపత్రం అందుకుంటున్న కృష్ణ

చెన్నూర్: తెలంగాణ ఫిషరీస్ సొసైటీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన సాధనబోయిన కృష్ణ నియామకమయ్యారు. సొసైటీ వ్యవస్థాపకుడు పిట్టల రవీందర్, నీల విప్లవ ప్రదాత, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎంవీ గుప్తా చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలను జిల్లాలోని మత్స్యకారులకు అందేలా కృషి చేస్తానన్నారు.

'దిందా'లో పురాతన విగ్రహాలు లభ్యం



పురాతన విగ్రహాలు

చింతలమానెపల్లి: మండలంలోని దిందా గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో సోమవారం పురాతన విగ్రహాలు లభ్యమయ్యాయి. కుమారస్వామి, ఆంజనేయుడు, నందీశ్వరుడి విగ్రహాలుగా గుర్తించిన గ్రామస్తులు వాటికి పూజలు నిర్వహించారు. మరికొన్ని విగ్రహాలు ఉన్నప్పటికీ శిథిలావస్థలో ఉండడంతో గుర్తించలేక పోయినట్లు తెలిపారు. విషయం బయటకు తెలియడంతో స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చి దర్శించుకుంటున్నారు.

'కార్మికులకు సరిపడా లాకర్లు ఏర్పాటు చేయాలి'



వినతిపత్రం ఇస్తున్న ఐఎన్టీయూసీ నాయకులు

శ్రీరాంపూర్: గనిపై కార్మికులకు సరిపడా లాకర్లు ఏర్పాటు చేయాలని ఐఎన్టీయూసీ నాయకులు యజమాన్యాన్ని కోరారు. ఆర్కే 5గనిలో శనివారం రాత్రి దొంగలు పడి చెక్కలాకర్లు పగలగొట్టి అందులో కార్మికులు దాచుకున్న సెల్‌ఫోన్లు, కొంత నగదు, ఇతర సామగ్రి ఎత్తుకెళ్లారు. ఈ సందర్భంగా ఐఎన్టీయూసీ నాయకులు సోమవారం గని రక్షణ అధికారి శివయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆర్కే 5బీ గనిని ఇటీవల మూసివేసి కార్మికులను ఆర్కే 5 గనిలో విలీనం చేశారని, వారందరికీ సరిపడా లాకర్లు లేవన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు ఈ.మల్లారెడ్డి, శ్రీనివాస్‌రావు, సురేందర్‌రెడ్డి, ప్రతాప్, రాజేందర్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

'చలో ప్రజావాణి విజయవంతం చేయాలి'



మాట్లాడుతున్న అంబాల ఓదెలు

రెబ్బెన: సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అందించాలని కోరుతూ ఈనెల 9వ తేదీన సీఎం రేవంతిరెడ్డిని కలిసి దరఖాస్తులు అందించేందుకు నిర్వహించే చలో ప్రజావాణి కార్యక్రమాన్ని కార్మికులంతా విజయవంతం చేయాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబాల ఓదెలు కోరారు. సోమవారం కై రిగూడ ఓసీపీ, మాదారం, సివిల్ డిపార్టుమెంట్, బ్లాస్టింగ్, సివిక్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు పెరగడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చారీ, ఇస్తారి, పర్వతాలు, కొమురన్న, తిరుపతి, బుచ్చయ్య, రాజన్న, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్య



శేక్ రియాజ్(ఫైల్)

జైనూర్: అప్పుల బాధ భరించలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని పవర్‌హౌస్ కాలనీకి చెందిన శేక్ రియాజ్ (46) ఆదివారం ఐచర్ వాహనం తీసుకొని పనుల నిమిత్తం కెరమెరికి వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం తెల్లవారుజామున ఓ ఐచర్ వాహనానికి రియాజ్ మృతదేహం వేలాడుతుండటం గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని భార్య అబేధాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

'అధికారుల నిర్లక్ష్యంతోనే సర్దార్ మృతి'

శ్రీరాంపూర్: అధికారుల నిర్లక్ష్యంతోనే మైనింగ్ సర్దార్ మచ్చ రమేశ్ మృతి చెందాడని ఏఐటీయూసీ మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీ రీజియన్ కార్యదర్శి వంగరి రాజేశ్వర్‌రావు, ఇన్‌చార్జి గోపతి సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కాసిపేట 2 గనిలో విధులు నిర్వహిస్తున్న రమేశ్ 16 రోజుల క్రితం గనిలో జారిపడడంతో ఎడమ మడమ కాలు విరిగింది. సాధారణ చికిత్సలు చేయడంతో పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. దీనికి యాజమాన్యమే బాధ్యత వహించాలని, నిర్లక్ష్యం వహించిన వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

రూ.కోటి పరిహారం చెల్లించాలి

రమేశ్ కుటుంబానికి రూ.కోటి పరిహారం అందించాలని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మంచిర్యాలక్రైం: స్థానిక గోదావరినదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు అంతర్గామ్ ఎస్సై సంతోష్ తెలిపారు. రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి మంచిర్యాల నుంచి గోలివాడ వైపునకు కాలి నడకన దాటే ప్రయత్నం చేయగా మార్గమధ్యలో నీటిలో మునిగాడు. మృతుని వయస్సు 40 సంవత్సరాలు ఉంటుంది. మృతుడు నీలిరంగు టీషర్ట్, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. మెడలో నలుపు రంగు తాయిత్తు ఉంది. మృతదేహాన్ని గోదావరిఖనిలోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. వివరాలు తెలిసిన వారు 8712656527 నంబరులో సంప్రదించాలని సూచించారు.

గంజాయి కేసులో ముగ్గురి బైండోవర్

బెల్లంపల్లి: గంజాయిని అక్రమంగా రవాణా చేసిన కేసుల్లో ముగ్గురు నిందితులను సోమవారం పోలీసులు బైండోవర్ చేశారు. కాల్‌టెక్స్ ఏరియాకు చెందిన ఎస్‌కే ముజ్జు అలియాస్ సల్మాన్, బాబుక్యాంపు బస్తీ వాసి చీమల సాగర్, కూరగాయల మార్కెట్ ఏరియాలో నివశిస్తున్న ఎండి .తాజ్ అలియాస్ లాడెన్‌లను స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

నీటిగుంటలో పడి యువకుడు మృతి



పంచనామా నిర్వహిస్తున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: స్థానిక శాలివాహన పవర్ ప్లాంట్‌కు చెందిన నీటి గుంటలో పడి ఓ యువకుడు మృతి చెందినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం స్థానిక రంగపేటకు చెందిన బోగాల పోచమల్లు కుమారుడు అశోక్(36) చేపలు పట్టేందుకు వెళ్లి నీటి గుంట సమీపంలో కూర్చొని ఉండగా ఫిట్స్ రావడంతో ప్రమాదవశాత్తు అదే నీటి గుంటలో పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

తృటిలో తప్పిన ప్రమాదం

భీమిని: మండల కేంద్రంలో గడ్డిలోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగలడంతో మంటలు చెలరేగాయి. ట్రాక్టర్ డ్రైవర్ అదే సాయి చాకచక్యంగా వాహనాన్ని వెంటనే ఊరి బయటకు తరలించి పెను ప్రమాదం జరగకుండా జాగ్రత్త పడ్డాడు. భీమిని నుంచి మాడవెల్లికి గడ్డి లోడ్‌తో వస్తుండగా మండల కేంద్రంలోని మీ సేవ వద్ద విద్యుత్ తీగలు తాకడంతో ఘటన చోటు చేసుకుంది. డ్రైవర్ చాకచక్యం వల్లే ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. కాగా ట్రాక్టర్‌లోని గడ్డి దగ్ధమైంది.

జాతీయ సెమినార్‌కు ముస్తాబు

- నేడు భైంసా డిగ్రీ కళాశాలలో హిందీపై సెమినార్
- హాజరు కానున్న వివిధ రాష్ట్రాల ప్రొఫెసర్లు, రీసెర్చ్ స్కాలర్లు



భైంసాలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

భైంసాటౌన్: నిర్మల్ జిల్లా భైంసాలోని గోపాల్‌రావు పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయస్థాయి సెమినార్‌కు ముస్తాబైంది. మంగళవారం హిందీపై నిర్వహించే సెమినార్‌కు వివిధ రాష్ట్రాల ప్రొఫెసర్లు, రీసెర్చ్ స్కాలర్లు హాజరు కానున్నారు. వివిధ అంశాలపై విస్తృత చర్చద్వారా ఆయా అంశాలపై కళాశాల విద్యార్థులు ప్రేరణ పొంది భవిష్యత్‌లో ఉన్నతులుగా ఎదిగేలా కళాశాల అధ్యాపక బృందం ప్రోత్సాహం అందిస్తోంది. ఇందులో భాగంగా సెమినార్లు నిర్వహిస్తోంది. గతేడాది కళాశాలకు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ బాటనీ ప్రొఫెసర్ వెల్మ మధు ఆధ్వర్యంలో 'అటవీ సంపద, వైవిధ్యం, వినియోగం, సంరక్షణ' అనే అంశంపై జాతీయ స్థాయి సెమినార్ నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి ప్రొఫెసర్లు హాజరై ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. తాజాగా హిందీ విభాగం ఆధ్వర్యంలో 'మానవీయ సంవేదన, సాహిత్య కే విభిన్న స్వర్' అనే అంశంపై సెమినార్ నిర్వహించనున్నారు. అధ్యాపక బృందం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఉస్మానియా, తిరుపతి ఎస్వీయూ, ఇఫ్లూ(హైదరాబాద్), ధర్మాబాద్, నాసిక్, థానే తదితర యూనివర్సిటీల హిందీ విభాగాధిపతులు ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు.

సెమినార్లతో ప్రయోజనం...

ఆయా సబ్జెక్టులపై జాతీయ సెమినార్ల నిర్వహణ ద్వారా కళాశాల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతోందని అధ్యాపకులు చెబుతున్నారు. కళాశాలకు సైతం గుర్తింపు పెరుగుతుందని పేర్కొంటున్నారు. కళాశాలకు ప్రస్తుతం న్యాక్ బి గ్రేడ్ గుర్తింపు ఉండగా, భవిష్యత్తులో గ్రేడ్ ఉన్నతీకరణకు ఈ సెమినార్లు దోహదపడతాయని అంటున్నారు. తద్వారా కళాశాలకు నిధులు రావడంతో విద్యార్థులకు అవసరమైన వసతుల కల్పిస్తామని చెబుతున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి సంబంధిత సబ్జెక్టు నిపుణులు ఇక్కడికే వచ్చి అవగాహన కల్పించడం ద్వారా విద్యార్థులకు ఆయా విషయాలపై సంపూర్ణ అవగాహన పెరుగుతుందని తెలిపారు.

హిందీపై అవగాహన కోసం...



డిపార్ట్‌మెంట్ ఆఫ్ హిందీ ఆధ్వర్యంలో 'మానవీయ సంవేదన్, సాహిత్య కే విభిన్న స్వర్' అనే అంశంపై జాతీయ సెమినార్ ఏర్పాటు చేశాం. ఈ సెమినార్‌కు వివిధ వర్సిటీల హిందీ విభాగాధిపతులు హాజరు కానున్నారు. హిందీపై విద్యార్థులకు విస్తృత అవగాహనకు ఈ సెమినార్ ఉపయోగపడుతుంది.

– పవన్‌కుమార్ పాండే, అసోసియేట్ ప్రొఫెసర్(హిందీ), జీఆర్పీ డిగ్రీ కళాశాల, భైంసా

ఏర్పాట్లు చేశాం...



భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీపై ఒకరోజు జాతీయ సెమినార్‌కు అన్ని ఏర్పాట్లు చేశాం. గతేడాది జీవ వైవిధ్యంపై సెమినార్ విజయవంతంగా పూర్తి చేశాం. ఉమ్మడి జిల్లాలోనే ఎక్కడా లేనివిధంగా కళాశాలలో జాతీయ సెమినార్ నిర్వహించడం గర్వంగా ఉంది.

– డాక్టర్ ఎం.సుధాకర్, ప్రిన్సిపాల్

రన్నింగ్‌లో బంగారు పతకం



బంగారు పతకం అందుకుంటున్న దంపతులు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని బూర్గుడ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ వైరగాడే ఆనంద్ రావు, శకుంతల దంపతులు రన్నింగ్ సీనియర్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారు. ఈ నెల 7న ఖమ్మంలో జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో దంపతులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. 1500 మీటర్ల రన్నింగ్‌లో ఆనంద్ రావు, 800 మీటర్లలో శకుంతల బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

బినామీ డీలర్‌పై కేసు



రేషన్‌షాపు తనిఖీ చేస్తున్న అధికారులు

జైనూర్: బినామీ డీలర్ల ఏరివేతలో భాగంగా మండలంలోని రాసిమెట్ట గ్రామానికి చెందిన రేషన్ షాపులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు శ్రీనివాస్, శ్యామ్‌లాల్ సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీలర్ పేరు శేక్ ఫజల్ ఉండగా మోసిన్ అనే వ్యక్తి షాపు నిర్వహిస్తున్నాడు. అంతేకాకుండా 1.5 క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉండటంతో బినామీ డీలర్ పై 6–ఏ కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

చికిత్స పొందుతూ మైనింగ్ సర్దార్ మృతి



మృతదేహం పరిశీలిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట 2గనికి చెందిన మైనింగ్ సర్దార్ మచ్చ రమేశ్(32) గోదావరిఖని సింగరేణి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. గత నెల 21న నార్త్‌లో 11లెవెల్ వద్ద కాలుజారి పడిపోవడంతో కాలికి గాయాలయ్యాయి. బీజోన్ ఆస్పత్రికి తరలించగా అక్కడి నుంచి గోదావరిఖనికి తరలించారు. ఊపిరితిత్తుల్లో రక్తం గడ్డ కట్టడంతో ఎక్స్‌రే నిమిత్తం తరలిస్తున్న క్రమంలో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. గని ప్రమాదంగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. ఏఐటీయూసీ నాయకుడు సీతారామయ్య డైరెక్టర్‌తో చర్చలు జరపడంతో యాజమాన్యం ఒప్పుకోవడంతో ఆందోళన విరమించారు. కాగా విధి నిర్వహణలో ప్రమాదం జరిగిన వ్యక్తిని కరీంనగర్, హైదరాబాద్ ఆస్పత్రులకు తరలించకుండా జాప్యం చేయడం విమర్శలకు తావిస్తోంది. బాధితుడిని విధుల్లో చేరాల్సిందిగా అధికారులు ఒత్తిడి చేయడంతో పాటు వైద్యంలో నిర్లక్ష్యం చేయడంతో మృతి చెందినట్లు యూనియన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈవిషయమై పూర్తిస్థాయిలో విచారణ జరిపి వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి, మాదారం టౌన్‌షిప్‌ల్లో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే టైలరింగ్, మగ్గం, బ్యూటీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ కోసం మహిళలు, యువతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏరియా అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోలేటిలో టైలరింగ్, మగ్గం, బ్యూటీషియన్.. మాదారంలో మగ్గం, బ్యూటీషియన్ కోర్సులకు ఉచిత శిక్షణ అందించనునట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 15 సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తులను పర్సనల్ డిపార్టుమెంట్‌లోని సేవా సమితి కోఆర్డినేటర్‌కు అందించాలన్నారు. పూర్తి వివరాలకు 9951214116 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

తల్వార్‌తో భయపెట్టిన యువకుల అరెస్టు



నిందితుల అరెస్టు చూపిస్తున్న ఎస్‌హెచ్‌ఓ

బెల్లంపల్లి: పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని రోడ్డుపై కేక్‌కట్ చేసి ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురి చేసిన వేర్వేరు ఘటనల్లో ఇద్దరు యువకులను సోమవారం అరెస్టు చేసినట్లు బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ బన్సీలాల్ తెలిపారు. కన్నాల బస్తీకి చెందిన దాసరి అజయ్ గతనెల 29న రాత్రి రోడ్డుపై పొడవాటి తల్వార్‌తో కేక్ కట్ చేశాడు. అంతటితో ఆగకుండా ఆ తల్వార్‌ను అందరికి చూపిస్తూ భయభ్రాంతులకు గురి చేశాడు. వీడియో ఇటీవల సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. రెండురోజుల క్రితం పోస్టాఫీసు బస్తీ ఏరియాలో హరికృష్ణ అనే యువకుడి పుట్టిన రోజు సందర్భంగా అనపర్తి సాయి పవన్ అనే యువకుడు కూడా తల్వార్‌ను చేతపట్టుకుని పాటో దిగి వాట్సాఫ్ స్టేటస్‌గా పెట్టుకున్నాడు. ఆయా ఘటనల్లో నిందితులిద్దరినీ పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.